


**18న ఖమ్మంలో జరిగే సిపిఐ భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి**

ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 10 జనవరి , 2026 | పేజీలు : 08

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు తగ్గడంపై కలెక్టర్ ఆగ్రహం

## యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు తగ్గడం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య శాఖ పై సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మండలాల వారీగా పిఎచ్‌సిలు, పల్లె దవాఖానలో జరిగే వైద్యం, ప్రసవాల పై రివ్యూ చేసిన జిల్లా కలెక్టర్ జిల్లాలో ప్రభుత్వ దవాఖానాలో సాధారణ ప్రసవాల సంఖ్య ఎందుకు పెరగడం లేదని, ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు ఉన్నాకూడా ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెలివరీలు జరగడం పై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె దవాఖానలల్లో వైద్యులు సరిగా అందుబాటులో లేకపోవడం వలన మూతబడి ఉంటున్నాయని అన్నారు. అలా ఉన్న వారికి ఇప్పటి వరకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం ఇకపై అలా చేస్తే నోటీసులు ఉండవని సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కొన్ని దవాఖానలో లేబర్ రూమ్‌లు కేవలం నామమాత్రంగానే ఉన్నాయని, అలా ఉండటానికి వీలు లేదని, ప్రతి దవాఖానలో నార్మల్ డెలివరీలు చేయాలని, ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ప్రతి మంగళవారం ఆశ డే అని సమావేశాలు మాత్రమే పెడుతున్నారు. కాని క్షేత్రస్థాయిలో వెళ్లడం లేదని, గ్రామాల నుండి గర్భిణిని స్త్రీలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారంటే ఆశాలు సరిగా పనిచేయడం లేదని అర్థంఅని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి నెల రివ్యూ చేపట్టడం జరుగుతుందన్నారు. పల్లె దవాఖానల్లో పేషెంట్లు తక్కువగా వస్తున్నారని, ఖాళీగా ఉన్న సమయంలో ప్రతి గర్భిణి స్త్రీ ఇంటికి ఫోన్ చేసి వాళ్ళ కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాలపై అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ చేయించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలో జరగాలని, ప్రైవేట్ ఆసుపత్రికి పంపడానికి వీలు లేదన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్, డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి యశోద, వీణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్స్, ఎంఎల్‌హెచ్‌పిలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఈదులగూడ సమీపంలో అద్దంకి నార్కట్‌పల్లి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు కూలీలు మృతిచెందారు. వన్ టౌన్ సీఐ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం హైద్రాబాద్‌లోని శంషాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు ఇటాలియన్ మార్బుల్స్ బండల లోడ్‌తో బయలుదేరిన డీసీఎం వాహనం శుక్రవారం తెల్లవారుజామున మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా వద్ద క్రాస్ చేసి పట్టణంలోకి వస్తున్న సిమెంట్ ట్యాంకర్‌ను వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బండల మధ్య పడుకున్న వీరుకుమార్(36), సంతోష్(30), సూరజ్(18)లు బండల మధ్య నలిగిపోయి అక్కడకక్కడే మృతిచెందారు. క్యాబిన్‌లో కూర్చొన్న సుజిత్‌కుమార్, కిషన్, సికిందర్‌లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ నాగభూషణంలు సంఘటన స్థలానికి చేరుకోని మృతదేహాలను, క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

# చిట్యాల మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలి

## ఎంపిచామల , ఎమ్మెల్యే వేముల

**ప్రజాపక్షం/చిట్యాల:** రాబోయే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా ఉండి ఎన్నికలలో పనిచేయాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంలు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటిలో వారు పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం స్థానిక బిఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అన్ని మున్సిపల్ కౌన్సిలర్ స్థానాలతో పాటుగా చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలంటే నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని అన్నారు. ఎంపి, ఎంఎల్‌ఏ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, నాయకులు దాసరి నర్సింహ్మా, దాసరి మల్లేషం, బొప్పని ఎల్లయ్యా, దాసరి కృష్ణ, దాసరి శ్రీరాములు తదితరులు కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు దేవదాసు, కనకదుర్గ ఆలయ చైర్మన్ మారగోని అంజనేయులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు జడల చినమల్లయ్య పాల్గొన్నారు.



# పారిశ్రామిక వాహనాలు అవసరం ఉన్నంతవరకే రాకపోకలు సాగించాలి

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులు క్షేమంగా రాకపోకలు సాగించుటకు పారిశ్రామిక వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలలో లేదా అవసరం ఉన్నంత వరకే రాకపోకలు సాగించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాల్ నుండి జిల్లా ఇండస్ట్రీస్ అధికారి సీతారాం నాయక్‌తో కలిసి సిమెంట్ కంపెనీ, రైస్ మిల్లర్స్, లారీ ఓనర్స్ ప్రతినిధులతో వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి 65పై హైదరాబాద్ నుండి ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు ఆంధ్రకు రాకపోకలు సాగిస్తున్నందు వలన, తేలికపాటి వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను, ట్రాఫిక్ రద్దీని నివారించుటకు, పండుగ కాలంలో వాహనాలు సాఫీగా ప్రయాణించుటకు హైవేపై భారీలోడ్ వాహనాల రాకపోకలను తగ్గించవలసిందిగా నిర్ణయించబడిందన్నారు. కావున లారీ ఓనర్లు, రైస్ మిల్లర్ అసోసియేషన్లు, సిమెంట్ కంపెనీ ప్రతినిధులు వారి యొక్క ఉత్పాదనలను ఎగుమతి దిగుమతులను పురస్కరించుకొని జనవరి 10 నుండి 18 వరకు లారీలు, ట్రక్కులు, ఇతర భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలలో నడుపాలన్నారు. రద్దీ తక్కువ ఉన్న రూట్లో వెళ్లాలని అవసరముని బట్టి తగ్గించుకోవాలని అవసరమైన సరుకులు, అత్యవసర సరఫరాలను తరలించే క్రమంలో సంబంధిత పోలీస్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సంబంధిత అధికారుల నుండి తగిన అనుమతి పొందిన పక్షంలో మినహాయింపు ఇవ్వబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# యాక్సిడెంట్ కేసులతో పెరుగుతున్న కేసుల భారం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పోలీసులు కోర్టుకు పంపుతున్న కేసులలో యాక్సిడెంట్ కేసులు, మాదకద్రవ్యాల వినియోగం కేసులు అధికంగా ఉంటున్నాయని, వాటితో కోర్టులలో పెండింగ్ కేసుల భారం రోజు రోజుకు పెరిగిపోతున్నాయని జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరీన్ తెలిపారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో ఆటో వర్కర్స్‌తో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారిని ఉద్దేశించి మాట్లాడారు. మైనర్ పిల్లలు వాహనాలు నడుపుతూ యాక్సిడెంట్లు చేస్తే వారితో పాటుగా వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని, ఆ కేసులలో పదివేల రూపాయల జరిమాన తో పాటు జైలుశిక్ష కూడా విధించడం జరుగుతుందని న్యాయమూర్తి వివరించారు. ఎవరైన బాలలు మాదకద్రవ్యాల వినియోగానికి బానిసలైనట్లుగా ఎవరి దృష్టికి వచ్చిన వెంటనే మండల న్యాయ సేవ అధికార సంస్థ అధికారులకు గాని, పోలీసులకు గాని తెలియపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, ఎంఎస్ రాఘవరావు, భూక్య నగేష్ రాథోడ్, జక్కుల వీరయ్య, ఉప్పల గోపాలకృష్ణమూర్తి, జుట్టుకొండ సంధ్య, సుంకరి ప్రదీప్తి, రామారావు, అడవి రాముడు, పాలేటి శ్రీనివాసరావు, మద్దుల నాగేశ్వరరావు, వెంకటేష్ నాయక్, దాసరి మోహన్, రమణారెడ్డి పలువురు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్ తండ్రి పార్థివ దేహానికి నివాళులు

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మండలంలోని రాజనాయక్‌తండ మాజీ సర్పంచ్ లునావత్ అశోక్ తండ్రి లునావత్ శ్రవణ్ సింగ్ మృతి చెందగా ఆయన పార్థివ దేహానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి జీడి బిక్షం, మాజీ సర్పంచులు ధరావత్ శంకర్ నాయక్, మోతీలాల్, గ్రామ సర్పంచ్ శాంతాబాయి పాండు నాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పెరుగు చిలికే కార్యక్రమం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పెరుగు చిలికే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెరుగు చిలికి వెన్నను తీసి స్వామివారికి నివేదించారు. దేవాలయ మండపమును పల్లె గ్రామముగా సుందరంగా అలంకరించి ఒక్క పల్లె టూరు వాతావరణంగా తయారు చేశారు. ఇందులో ఒక ఎడ్ల బండి ఆవుదూడ, ఉట్లు వేలాడి దీసి చూడముచ్చటగా అలంకరించారు. భక్తజన సందోహం తండోపతండములుగా స్వామి వారిని దర్శించి భజనలు, కీర్తనలతో స్వామివారిని కొనియాడి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సంకర్షణ ఆచార్యులు, శ్రీహరిఆచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు స్వామి వారిని సుందరంగా అలంకరించారు. ఆండాళ్‌గోష్టి, గోవిందమాల భక్తబృందం పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

## స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుతా

**ప్రజాపక్షం/అర్వపల్లి :** రామన్నగూడెం గ్రామ పంచాయితీని స్వచ్ఛ గ్రామ పంచాయితీగా తీర్చిదిద్దుతానని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. శుక్రవారం గ్రామస్తులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో చెత్తదిబ్బను తీసివేయడం, వ్యర్థాలను ట్యాంకర్ ద్వారా బయటకు తరలిస్తామని రోజువారీగా మురికి కాల్వలను శుభ్రం చేసి రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తదిబ్బలను తొలగిస్తామని అన్నారు. ప్లాస్టిక్ లేకుండా చూస్తామని గ్రామంలో మురిగినీటి నిల్వలను లేకుండా చూస్తామని బ్లీచింగ్ ఫౌడర్స్, ఆయిల్ బాల్స్ ఉపయోగించి గ్రామ పరిశుభ్రతను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రవీందర్, సిహెచ్‌ఓ బిచ్చు నాయక్, కార్యదర్శి సుధాకర్, ఏఎన్‌ఎం గిరిజ, అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, వార్డు సభ్యులు తవిటి సైదులు, శారద నాగరాజు, ముడావత్ తనేష్ పాల్గొన్నారు.




## జిల్లాలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు విస్తృత అవకాశాలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లాలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు మరింత ప్రాధాన్యం లభించనుంది. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో 12 ప్రైవేట్ పారామెడికల్ కళాశాలలకు అనుమతి మంజూరైనట్లు తెలిపారు. ఈ కళాశాలల ద్వారా జిల్లా స్థాయిలో నైపుణ్య వృత్తి విద్యకు విస్తృత అవకాశాలు కలుగనున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కళాశాల్లో డిఎంఎల్‌టి, డిఓఏ, డిహెచ్‌ఎఫ్ ఎస్‌ఎం, డిడిఏఐఎల్‌వై, డిఆర్‌టి, డిఓఎం, డిడిటి, డిఏఎన్‌ఎస్, డిసిసిటి, డిఆర్‌జిఏ, డిఓఆర్‌ఏ, డిఇసిజి, డిసిఏఆర్‌ఐఓ, డిఇపిటి, డిఎంఎస్ తదితర పారామెడికల్ కోర్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొత్తం 425 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు, ఇప్పటికే 392 మంది విద్యార్థులను కౌన్సిలింగ్ ద్వారా ఎంపికైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ సందీప్ రెడ్డి, సిహెచ్‌ఓ శివశంకర్, జిల్లా సూపర్‌వైజర్ శ్రీనివాస్, గణాంక నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అధైర్యపడొద్దు... పోలీస్ అండగా ఉంది



**ప్రజాపక్షం/మునగాల:** సర్పంచ్ ఎన్నికల సమయంలో మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామంలో షెడ్యుల్డ్ క్యాస్ట్ వర్గంపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి జిల్లా ఎస్‌పి కె.నర్సింహా శుక్రవారం బాధితుల ఇండ్లకు స్వయంగా వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం ప్రకారం బలమైన కేసు నమోదు చేశామని, దీనిలో 11 మంది నిందితులను చేర్చామని, ఈ కేసును పారదర్శకంగా వేగంగా దర్యాప్తు చేసి త్వరితగతిన వారికి చట్టపరమైన శిక్షలు అమలయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం చాల శక్తివంతమైనదని, చట్టంపై నమ్మకం ఉంచాలని కోరారు. గ్రామంలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, గ్రామంలో పూర్తిస్థాయి నిఘా ఉంచామని, ఎవరు అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రామారావు, మునగాల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణారెడ్డి, మునగాల ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



**ప్రజాపక్షం/కోదాడ:** స్థానిక కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. హైద్రాబాద్‌లోని ప్రముఖ రిక్రూటింగ్, స్టాఫ్పింగ్ కంపెనీలైన ఫ్యూచర్ ఫోకస్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఫ్యూచర్ ఫోకస్ కంపెనీ ఎండి సయ్యద్‌హీన ఆధ్వర్యంలో రిటన్ టెస్టు, జాం పద్ధతిలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 16 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారి విద్యార్థికి వార్షిక వేతనం రూ.4 లక్షల80వేలు ఉంటుందని కంపెనీ మానవ వనరుల అధికారులు వైష్ణవి, అనూష లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పెరుమాళ్ల గాంధీ, టిపివో పుష్పలత, అధ్యాపకులు అభినందించారు.

## ఉప్పల కాంతారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

**ప్రజాపక్షం/మునగాల:** మునగాల పరగాణ సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ ఉప్పల కాంతారెడ్డి కమ్యూనిస్టు పార్టీకి అందించిన సేవలు మరువలేనివని సిపిఎం గ్రామశాఖ కార్యదర్శులు గడ్డం వినోద్, కిన్నెర వెంకన్న లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గణపవరం ప్లైఓవర్ బ్రిడ్జి కింద కాంతారెడ్డి మూడవ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, నాయకులు ఉడుం కృష్ణ, సిహెచ్ సీతరాం, కాసర్ల వెంకట్, దేవరం శ్రీనివాస రెడ్డి, వల్లోజు వసంతకుమార్, జి.శివ, యశ్వంత్, ముస్తాఫా, గడ్డం వెంకటేశ్వర్లు, వెంకయ్య, గడ్డం వెంకన్న పాల్గొన్నారు.



## కెటిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ హుజూర్‌నగర్‌లో యూత్ కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. శుక్రవారం స్థానిక ఇందిర చౌక్ సెంటర్‌లో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కుక్కడపు మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కెటిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మహేష్‌గౌడ్ మాట్లాడుతూ పదేళ్ల కాలంలో అధికారంలో ఉండి నిరుద్యోగ యువతను వంచించిన బిఆర్‌ఎస్ నాయకులు, ఇప్పుడు అధికారం కోల్పోయాక తమ ఉనికిని కాపాడుకోవడానికి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే రాహుల్ గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి లకు క్షమపణాలు చెప్పాలని, లేని పక్షంలో నిరసనలు మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చెన్నగాని వెంకన్న, ఆవుల హరికృష్ణ, రాము, అశోక్, కందుల వినోద్, చెన్నగాని జగన్‌మోహన్, నకిరేకంటి సతీష్, వీసాల నాగరాజు, బెల్లంకొండ రఘు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సభను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సూర్యాపేట పట్టణంలో జరిగే ఉద్యమకారుల సభను జయప్రదం చేయాలని నాటి తెలంగాణ జెఏసి ఉమ్మడి జిల్లా బాధ్యులు, తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ ఉద్యమ సహచరులకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటంలో ఉద్యమకారుల పాత్ర కీలకమని, కానీ ఇప్పటికి వారికి తగిన గుర్తింపు, గౌరవం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు గుర్తింపు, సంక్షేమ పథకాలు ప్రకటించినప్పటికి అమలు జరగకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

## విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని, పోటీతత్వంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని నాగారం సర్పంచ్ గుంటకండ్ల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుంటకండ్ల సావిత్రమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో డిబేట్ పీరియడ్ ఉండేదని, డిబేట్ పీరియడ్ పెడితే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మనమడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి కుమారుడు గుంటకండ్ల వేమన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కళాశాల విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య, అధ్యాపకులు వీడిఎస్ ప్రసాద్, వాసు, గురువయ్య, సైదులు, బషీర్, ఉన్నిసా, వెంకటకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

## పిఆర్‌ఏ కార్యక్రమం విజయవంతం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** సికింద్రాబాద్‌లోని లొయోలా అకాడమీ డిగ్రి, పిజి కళాశాల విద్యార్థులు ఆర్‌ఏడబ్లుఇ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని గాజులమల్కాపురం గ్రామంలో పిఆర్‌ఏ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కెవికె శాస్త్రవేత్తలు సిహెచ్ నరేష్ గౌడ్, పి అక్షిత్‌సాయి రైతులకు పంటల నిర్వహణ, మట్టి సారవంత, సాగునీటి వినియోగం, మార్కెటింగ్‌పై విలువైన సూచనలు అందించారు. గ్రామ టైమ్‌లైన్, జనాభా పై చార్ట్‌లు, పంటల బార్ గ్రాఫ్‌లు, మట్టిరకాల విశ్లేషణ ద్వారా రైతుల్లో అవగాహన కల్పించారు. ఈ పిఆర్‌ఏ కార్యక్రమం ద్వారా గ్రామీణ అభివృద్ధి, సుస్థిర వ్యవసాయానికి దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్ వెంకట్‌రాంరెడ్డి, వార్డు సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని భువనగిరిలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి డిగ్రీ కళాశాలలో రంగవల్లుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ 1, 2, 3 విభాగాల ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులు రంగురంగుల ముగ్గులు (రంగవల్లులు) వేసి తమలోని ఈ సృజనాత్మకతను ఆసక్తిని కనబరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ వంశ తిలక్ మాట్లాడుతూ విద్యార్థులు మన సంస్కృతి సాంప్రదాయాలు మర్చిపోకుండా అందులోని అంతరాలను గ్రహించి ఈ తరానికి అందజేయాలని కోరారు.



## కెటిఆర్ దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/రామన్నపేట :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డిల పై కేటీఆర్ చేసిన అసభ్యకర మాటలను నిరసిస్తూ రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్లో కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు మోటె క్రాంతి, మాజీ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గురిజాల మహేష్ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మేకల జలెందర్, యువజన కాంగ్రెస్ నాయకులు పల్లపు రవి పాల్గొన్నారు.

## ఘన సన్మానం



**ప్రజాపక్షం/రామన్నపేట :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ మోటే రమేష్, వార్డు సభ్యులు మోటే మహేష్, బండ కవిత లింగస్వామి, గౌరిగే పారిజాత శేఖర్‌లను రామన్నపేట కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప గుడి ఆవరణలో ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో సిందం లింగయ్య, మిర్యాల మల్లేష్, మోటే మల్లేష్, ఎర్ర అంజయ్య, కడగంచి ఐలయ్య, బర్ల డేవిడ్ పాల్గొన్నారు.

## బాదె రూబేను పరామర్శ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరు గ్రామానికి చెందిన, బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర స్థాయి సభ్యులు బాదె రూబెన్ కుమారుడు బాదె శ్రీమోన్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించడంతో విషయం తెలుసుకున్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్‌రెడ్డి శుక్రవారం రూబెన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి, శ్రీమోన్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈయన వెంట బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు కునగళ్ల మల్లేశం, కానుగంటి శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** నేటి యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని సన్మార్గంలో నడవాలని ఏబీవీపి రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపిచంద్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానందుడి 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్. నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్, ఏబీవీపి నగర కార్యదర్శి పర్వతం దినేష్, విద్యార్థి నాయకులు చరణ్, చిరు, అంజి, విద్యారులు తదితరులు పాల్గొన్నారు.




## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలోని బాలాజీనగర్‌లో బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బొల్లం మల్లయ్యయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. నిలువ నీడలేని నిరుపేదలకు ఇళ్లు అందించాలనే లక్ష్యంతో బిఆర్ఎస్ ప్రభుత్వం కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌లో సుమారు 100 కోట్ల వ్యయంతో 362 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిందని, అప్పటి కలెక్టర్ పర్యవేక్షణలో లబ్ధిదారుల ఎంపిక పూర్తయిందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్, హెల్త్ సెంటర్ నిర్మించామని గుర్తు చేశారు. లబ్ధిదారుల ఎంపికై పూర్తై రెండేళ్లు గడుస్తున్నా కేవలం విద్యుత్ లేదని సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ లబ్ధిదారులను ఇళ్లలోకి చేర్చడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు షేక్ నయీం, హనుమాన్‌నాయక్, మాజీ కౌన్సిలర్లు కందుల చంద్రశేఖర్, మామిడి రామారావు, అల్వాల వెంకట్, మేదరి లలిత, కర్ల సుందర్‌బాబు, పిట్టల భాగ్యమ్మ, దొంగరి శ్రీనివాస్, చలిగంటి వెంకట్ పాల్గొన్నారు.

## విద్యార్థులు పోటీ తత్వంతో ముందుకు సాగాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** విద్యార్థులు పోటీ తత్వంతో ముందుకు సాగాలని యూనిటీ ఫార్మసీ కళాశాల చైర్మన్ ఏ.ప్రభాకర్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం శివారులోని రాయగిరి గ్రామంలో గల యూనిటీ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫార్మసీ విద్యార్థులకు పోస్టర్ ప్రెజెంటేషన్ కాంపిటీషన్స్ నిర్వహించినారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఏ.ప్రభాకర్ రెడ్డి విద్యార్థులు ఇలాంటి కాంపిటీషన్స్‌లో పాల్గొంటే విద్య, విషయ నైపుణ్యాలు పెంచుకోవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి ఇలాంటి కార్యక్రమాల ఉపయోగాలు గుర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రధానం చైర్మన్ చేతుల మీదిగా జరిగినది నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ పి.గోవర్ధన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంపటి శ్రీనివాస్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత విజేతలైన విద్యార్థిని విద్యార్థులను అభినందించినారు.

## చేనేత కళాకారుల రుణమాఫీ నిధులు బ్యాంకుల్లో జమ చేయాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** చేనేత కార్మికులకు రుణమాఫీ నిధులను వెంటనే బ్యాంకుల్లో జమ చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, బీజేపీ నేత డా.వకుళాభరణం కృష్ణమోహన్ రావు డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా భూదాన్ పోచంపల్లిలో బీజేపీ చేనేత సెల్ నిర్వహించిన రిలే నిరాహార దీక్షల్లో శుక్రవారం డా.వకుళాభరణం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చేనేత వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ వర్గ ప్రజలను పట్టించుకోకపోవడం పాలనలో బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు గంజి బసవలింగం, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పట్టణ అధ్యక్షుడు డబ్బికర్ రమేష్, మాజీ అధ్యక్షుడు రచ్చ సత్యనారాయణ, నేతలు భరత బాలరాజ్, ఈకే శ్రీనివాస్, భరత్ భూషణ్, చెరుకూరి వెంకటేశం, గంజి సుధర్శన్, వరకాల వెంకటేశం, బి.రఘు, మేకల చొక్కా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజీనామా



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ధనవాత్ బీకు నాయక్ తెలిపారు. శుక్రవారం భువనగిరిలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఘోరంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి 18 సంవత్సరాలు సేవ చేస్తే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణా రెడ్డి కనీస మర్యాద ఇవ్వలేదని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా అవమానానికి గురి చేశారన్నారు. మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి నేను గిరిజన బిడ్డను కనుకే నన్ను అణిచివేశారన్నారు. ప్రోటోకాల్ ఆహ్వానంతో ముఖ్యమంత్రి పర్యటనలో ప్రెసిడెన్సియల్ సూట్ వద్ద నన్ను నువ్వెందుకు వచ్చావ్ వెళ్ళిపో అంటూ జగదీశ్వర్ రెడ్డి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. భరించలేని దుఃఖంతో అక్కడి నుండి వెళ్ళి పోయానన్నారు. రాజకీయ అవమానాలకు అవకాశం లేని బీసీ నినాద తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనే పార్టీ ఉందని ఆ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తీన్మార్ మల్లన్న నేతృత్వంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో పని చేస్తానని పేర్కొన్నారు. అగ్రకుల పార్టీల నుండి అందరూ బయటకు రావాలని కోరారు. ఈ సమావేశంలో నరేష్, కొమురయ్య, శ్రీనివాస్, రాజనర్సయ్య, యాదగిరి యాదవ్, పోషెట్టి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



## లక్ష్మీనరసింహుని సేవలో ఎఐసిసి జనరల్ సెక్రటరీ విష్వనాథన్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, కాంచీపురం మాజీ ఎంపీ విష్వనాథన్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం విష్వనాథన్ స్వామివారి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా, అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉన్నతాధికారులతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయ కులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్వగృహానికి విష్వనాథన్ విచ్చేశారు. అక్కడ ఆయనను ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించి, జ్ఞాపికగా స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## బ్యాంకులు, పోలీసు శాఖ మధ్య సమన్వయం అవసరం



**ప్రజాపక్షం/యాదాద్రి :** బ్యాంకుల భద్రత కోసం బ్యాంకులు పోలీసు శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని బ్యాంకుల భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయడం లక్ష్యంగా, జిల్లా ఎస్పీ అధ్యక్షతన శుక్రవారం భువనగిరిలో జిల్లా స్థాయి బ్యాంక్ భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జాతీయీకృత బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు మరియు కోఆపరేటివ్ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు. సమావేశంలో బ్యాంకులు ఎదుర్కొంటున్న భద్రతా సవాళ్లు, నగదు లావాదేవీల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల నివారణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్యాంకు సిబ్బంది, ఖాతాదారుల భద్రత అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. బ్యాంక్ మేనేజర్లు తప్పకుండా అన్ని బ్యాంక్ బ్రాంచ్లు మరియు ఏటీఎంలలో సీసీటీవీ కెమెరాలు పూర్తిగా పనిచేసే విధంగా ఉండాలని సూచించారు.

## ఇకపై నో హెల్మెట్ ...నో పెట్రోల్



**ప్రజాపక్షం/చండూరు:** ఇకపై పెట్రోల్ బంక్‌లలో ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ పోయించుకోవాలంటే వాహనదారుడికి తప్పనిసరిగా హెల్మెంట్ ఉండాలిందేనని చండూరు ఎస్ఐ ఎన్.వెంకన్న తఠినతరం చేశారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు చండూరు మండలంలో ఉన్న ఏ పిట్రోల్ బంక్‌లోనైన ద్విచక్ర వాహనానికి పిట్రోల్ పోసుకోవాలంటే వాహనం నడిపే వ్యక్తికి హెల్మెట్ ఉంటేనే పిట్రోల్ పోయాలని బంక్ యాజమాన్యానికి సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని బంగారిగడ్డ భారత్‌పెట్రోల్ బంక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ యాజమాని బోయపల్లి సైదులు , బంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్య విలువైన సంపద

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్య విలువైన సంపద అని జప్తివీరప్పగూడెం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి భిక్షపతి అన్నారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులకు తిథి భోజన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, యడవెల్లి దామోదర్‌రెడ్డి, పోరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, వి.మాధవి,టి.శ్రీనివాస్‌రెడ్డి, ధీరావత్ జల్‌రామ్, రేణుకలు పాల్గొన్నారు.





## ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/చిట్యాల: అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించింది నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన స్నేహితుల బృందం. తమతో కలిసి 1996/97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న స్నేహితుడు మన్నెం శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా అతనితో కలిసి చదువుకున్న స్నేహితులు రూ. 50వేలు మృతుడి తల్లిదండ్రులకు శుక్రవారం రోజున అందజేశారు. ఈకార్యక్రమంలో స్నేహితులు నారబోయిన శ్రీనివాస్, ఏనుగు రవిందర్‌రెడ్డి, జిట్ట మల్లేష్, లింగాల యాదయ్య, రాధారపు వెంకన్న, రుద్రవరం లింగ స్వామి, పోకల కరుణాకర్ పాల్గొన్నారు.

## స్వచ్ఛత కార్యక్రమం

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ జక్కుల రాణమ్మ యాదయ్య, ఉప సర్పంచ్ బీసు ప్రశాంత్‌గౌడ్, వార్డు సభ్యులతో కలిసి స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జిల్లాలోనే అంబాల గ్రామాన్ని ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని రోడ్లను డోజర్ సహాయంతో శుభ్రం చేయించి, అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్లను శుభ్రం చేశారు.

## ఫిర్యాదులు చేసుకోవచ్చు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సీనియర్ సిటిజన్స్ తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు మిర్యాలగూడ సబ్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చని సబ్ కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్‌శర్మ అన్నారు. శుక్రవారం సీనియర్ సిటిజన్స్ ఫిర్యాదులను ఆలకించే కమిటీ సమావేశం నిర్వహించగా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లికి చెందిన వృద్ధురాలి ఫిర్యాదు స్వీకరించి పరిశీలించి ఇరువర్గాలతో మాట్లాడారు. వ్యవసాయ భూమి ఫౌతి విషయంలో వచ్చిన వివాదాన్ని ఇరు పక్షాల వాదనలు విని తీర్పు ఇస్తామని పాటించాలని చెప్పి పంపారు. ఫిర్యాదుల స్వీకరణ కమిటీ సభ్యులైన వృద్ధుల సంక్షేమ అధికారి, మిర్యాలగూడ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత తదితరులు ఉన్నారు.

## ముగ్గుల పోటీలు

ప్రజాపక్షం/నకిరేకల్ : సంక్రాంతి సందర్భంగా నకిరేకల్ మండలం తాటికల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాలికా విద్య ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులు వేసిన ముగ్గులు పలువురిని ఆకర్షించాయి.కార్యక్రమానికి న్యాయ నిర్ణయతగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని కానుగుల చంద్రకళ వ్యవహరించారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య పాల్గొన్నారు.



# ప్రణాళికతో చదివితే విజయం తథ్యం



ప్రజాపక్షం/నకిరేకల్ :పదవ తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే విజయం సాధించడం తోపాటు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని నకిరేకల్ మండల విద్యాశాఖ అధికారి మేక నాగయ్య అన్నారు శుక్రవారంమండలంలోని తాటికల్‌ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన ఉచితంగా అభ్యాస దీపికలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం అందజేస్తున్న అభ్యాస దీపికలు ఎంతగానో దోహదపడుతాయని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న,ఉపాధ్యాయ బృందం పండుగ తిరుమలయ్య,మోసంగి హరీష్చంద్ర,మార్త రాములు,డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి,లొట్లపల్లి కోటయ్య,నూకల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన



ప్రజాపక్షం/నకిరేకల్ : సర్వీస్ లోఉన్నఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని,సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నకిరేకల్ మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ పిలుపులో భాగంగానిర్వహించిన ఈకార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సంపూర్ణమద్దతుప్రకటించింది.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని,జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని వారు కోరారు. పాఠశాల లవిలీనంమూసివేతలనుతక్షణమేనిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్‌నాయకులు యాట మధుసూదన్ రెడ్డి,టి.నర్సింహమూర్తి,కె.శ్రీనివాస్,ఈ.హరికృష్ణ, జి.శ్రీలత,యం.మల్లేష్,ఎల్.నగేష్, బి.వేణుగోపాల్, కె.విద్యాసాగర్,సాగర్ల సత్తయ్య,పండుగ తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో సామాగ్రి ఇల్లు దగ్ధం



ప్రజాపక్షం/నకిరేకల్ : పట్టణంలోని 12వ వార్డు శివాజీ నగర్ లో ప్రవేట్ ఉపాధ్యాయుడు దేగల సైదులు ఇంటిలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. బాధితుడు సైదులు తెలిపిన వివరాల ప్రకారం ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నానని విధులకు హాజరైన అరగంటలోనే పొరుగువారు ఇచ్చిన సమాచారంతో వెంటనే వచ్చి చూడగా ఇంటిలో నుండి పొగలు వస్తున్నట్లు తెలిపారు.బీరువాలో ఉన్న రూ. 50 వేల నగదుతో పాటు రిఫ్రిజిరేటర్,బీరువా,నిత్యవసరాలు,వంట సామాగ్రి,దుస్తులు మంటల్లో పూర్తిగా కాలిపోయినట్లు రోదిస్తూ తెలిపారు. షార్ట్ సర్క్యూట్ జరిగిన సమయంలో ఇంటిలో ఎవరూ లేరని తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితున్నీ పరామర్శించి సంఘటన జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.కుటుంబానికి అవసరమైన నిత్యవసరాలు,వంట సామాగ్రి అందజేయాలని మునిసిపల్ చైర్మన్ చౌగొని రజిత శ్రీనివాస్ గౌడ్ కు సూచించారు.ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు బానోతు వెంకన్న,గాజుల సుకన్య ఉన్నారు.

## ఎమ్మెల్సీ సత్యంకు కృతజ్ఞతలు

ప్రజాపక్షం/మునుగోడు : శాసనమండలిలో చేనేత కార్మికుల సమస్యలను ప్రస్తావించినందుకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కు మండల చేనేత కార్మిక సంఘం నాయకులు శుక్రవారం సిపిఐ కార్యాలయంలో కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా చేనేత కార్మికుల త్రిప్పు పండు,చేనేత మిత్ర పథకాలను ఈప్రభుత్వం ప్రవేశపెట్టి ఇంతవరకు అమలు చేయలేదని,చేనేత కార్మికుల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని.చేనేత సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు మీ వెంటే ఉంటామని వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో చేనేత కార్మికులు,చేనేత సంఘం మండల అధ్యక్షులు చెరుకు సైదులు,సిహెచ్ మధు,చెరుకుపల్లి లక్ష్మయ్య,చెరుకు మల్లయ్య,రామదాసు,సింగం గిరి తదితరులు పాల్గొన్నారు.




## కిట్ అందజేత

ప్రజాపక్షం/మోటకొండూర్ :
మోటకొండూరు మండల కేంద్రంలో మోటకొండూరు మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, గ్రామపంచాయతీ 12వ వార్డు సభ్యులు జూకంటి మధు స్వంత నిధులతో అంగన్ వాడి కెంద్రం 3 కుర్చీలు, పలకలు, పుస్తకాలు, టేస్తకాలు, ఫ్యాన్, గ్యాస్ స్టవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగ కిరణ్, మోటకొండూరు సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్‌లు పాల్గోని మాట్లాడుతూ జూకంటి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు బుగ్గ కొమురయ్య పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; జాతీయ రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు శుక్రవారం సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్‌లు అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి చౌరస్తా వరకు హెల్మెట్‌లు ధరించి ద్విచక్ర వాహనదారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణించాలని అన్నారు. మైనర్లు వాహనాలు నడపకూడదని సూచించారు. అన్ని పెట్రోల్ బంక్‌ల వద్దకు వెళ్ళి హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ పోయకూడదని సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, సామాజిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; గ్రామాల అభివృద్ధికి సహకరించాలని నూతనంగా గెలిచిన మండల పరిధిలో గెలిచిన వివిధ గ్రామాల సర్పంచ్‌లు శుక్రవారం తహశీల్దార్ నరేందర్, ఎంపిడివో స్వర్ణలతలను కోరారు. శుక్రవారం వారు తహశీల్దార్, ఎంపిడివోలను కార్యాలయాలలో మర్యాదపూర్వకంగా కలిసి బోకేలను అందజేసి, శాలువాలతో సన్మానించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామాల అభివృద్ధికి తాము కృషి చేస్తామని, దానికి తోడుగా అధికారులు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు రమావత్ రాజునాయక్, రమావత్ దీప్‌లాల్‌నాయక్, ఇరిగి రామకృష్ణ, బోయిన శేఖర్, ఆదిరాల సుమలత రమేష్, అంగోతు సుగుణ సుక్య తదితర సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## మున్నూరుకాపులంతా ఏకం కావాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సమస్యల పరిష్కారానికి మున్నూరు కాపులంతా ఏకం కావాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ట్రెజరర్ కంచి సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి పందిరి వేణు అన్నారు. సంఘం నూతన క్యాలెండర్‌ను వారు శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. మున్నూరు కాపులకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందించి అమలు చేయాలని కోరారు. సంఘం బలోపేతానికి పార్టీలకతీతంగా కాపులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నేతి వెంకటేశ్వర్లు, నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షుడు చామల కేశవులు, ఉపాధ్యక్షుడు మారబోయిన చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల చంద్రశేఖర్, కటూట రాంబాబు, గంధం సైదులు, బీఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు పెంచాకే...

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: బీసీ రిజర్వేషన్లు పెంచాకే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు వెళ్తామని అనడం బీసీలకు అన్యాయం చేయడమేనన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కూడా బీసీలకు అన్యాయం జరిగిందని, మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున డబ్బు ప్రభావం ఉంటుందని, బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, గుండెబోయిన నాగేశ్వర్‌రావుయాదవ్, బంటు సైదులు, దొనేటి శేఖర్, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఉద్దీపన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నకిరేకల్ :** జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ మేళాలో నకిరేకల్ పట్టణంలోనిఉద్దీపన పాఠశాలవిద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి రెండు అవార్డులుకైవసంచేసుకోవడంతో శుక్రవారం విద్యార్థులను ఎమ్మెల్యే వేముల వీరేశం ఉపాధ్యాయులను సన్మానించారు.ఈ కార్యక్రమంలోఆ పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధరి భద్రయ్య కోఆర్డినేటర్ సతీష్ ప్రైమరీ హెడ్మాస్టర్ రామయ్య,ఉపాధ్యాయులు శ్రీలత,జీవన్, శిరీష,నాగమణి,నాగజ్యోతి, మాధురి,వెన్నెల, హమీద,సమత,లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

## క్రీడా దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని సోలిడార్ తెలంగాణ బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం కేఎంపి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జైమారుతి బెంగళూరు బేకరి యజమాని సదానందం ఆర్థిక సహకారంతో క్రీడా దుస్తువులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కేఎంపి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మాట్లాడుతూ గతంలో వివిధ క్రీడల్లో బధిర విద్యార్థులు ప్రతిభ కనబరిచారని, వారిని ప్రోత్సహించాలనే ఉద్యేశ్యంతో దుస్తువులు పంపిణి చేసినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కేఎంపి హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు ఏరుకొండ రాము, కూన భాను చందర్, పాఠశాల నిర్వాహకులు దార్ల భాస్కర్, సురేష్, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

## పండుగల విశిష్టతను తెలియజేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :**పండుగల విశిష్టతను సాంృతి సాంప్రదాయాలను విద్యార్థులకుతెలియజేయడం అభినందనీయమని నకిరేకల్ ఎంఈఓ మేక నాగయ్య అన్నారు.శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని శాస్త్రహై స్కూల్ సంక్రాంతిసంబరాలను అనందోత్సాహంగా జరుపుకున్నారు.ఈకార్యక్రమంలో శాస్త్ర స్కూల్ చైర్మెన్ ఎం.చంద్రశేఖర్,శాస్త్ర డైరెక్టర్ ట్రస్మా వైస్ ప్రెసిడెంట్ సరితారెడ్డి,ఏఓ నాగేశ్వరరావు,ప్రీప్రైమరీ ఇంచార్చి,మణిదీప్,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/చివ్వెంల :** సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చివ్వెంల మండల నాయకుల సమక్షంలో లబ్ధిదారులకు శుక్రవారం సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోతు కిషన్ నాయక్, గుగులోతు అనిల్ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ముమ్మరంగా ఆపరేషన్ స్మైల్



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పిల్లల భద్రత , సంక్షేమం లక్ష్యంగా ఆపరేషన్ స్మైల్ 2026 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం భువనగిరిలో ఎస్పీ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యా శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, చైల్డ్‌లైన్ (1098), జిల్లా బాలల సంక్షేమ కమిటీ (CWC), జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్వచ్ఛంద సంస్థలు (NGOs) వంటి అన్ని ప్రత్యేక విభాగాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని విభాగాల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహిస్తామన్నారు. తప్పిపోయిన, దారి తప్పిన పిల్లలను గుర్తించి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించడం, బాల కార్మిక వ్యవస్థను అరికట్టడం, భిక్షాటనలో ఉన్న పిల్లలను రక్షించడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ, పునరావాసం మరియు విద్యావకాశాలు కల్పించడం లాంటి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్ ప్రాంతాలు, ఇటుక బట్టీలు, పరిశ్రమలు, హోటళ్లు వంటి ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలు ఇబ్బందుల్లో ఉన్నట్లు గమనించిన పక్షంలో ప్రజలు వెంటనే చైల్డ్‌లైన్ 1098 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.

# వివేకానంద పాఠశాలలో ఇంద్రజాల ప్రదర్శన




**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక మండల కేంద్రంలోని వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్లో శుక్రవారం ప్రఖ్యాత ప్రసిద్ధ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్ రికార్డ్స్ గ్రహీత, ప్రముఖ మెజీషియన్ రామకృష్ణ ద్వారా అద్భుతమైన ఇంద్రజాల ప్రదర్శన (మ్యాజిక్ షో) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకట్టుకునే విధంగా ఆనందోత్సాహాలతో ముంచెత్తారు. వివిధ రకాల ఇంద్రజాలాలతో పిల్లలు ఆశ్చర్యానికి గుర్రై ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ పిల్లల్లో మొబైల్ ఫోన్ వాడకం అధికం కావడం వల్ల చదువుపై శ్రద్ధ తగ్గుతున్న విషయాన్ని, సమర్థవంతంగా చదువుతూ మంచి మార్కులు సాధించే చిట్కాలను కూడా ప్రేరణాత్మక ప్రసంగంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అస్మా, నాగరాజు, సునీత, శాంతి, సుధారాణి, సరిత, అనిత, రాజేశ్వరి, ముత్యాల సాయి, విద్యాసాగర్, పారిజాత, మమత, సింధు, మమత తదితర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చైనా మాంజాను అమ్మినవారిపై కేసు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలో ప్రభుత్వ నిషేధిత చైనా మాంజాను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో నిమ్మల శ్రీనివాస్ s/o లింగయ్య , వయస్సు 40, తన కిరాణా షాప్ ( శ్రీనివాస కిరణం)లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిషేధిత చైనా మాంజాను అక్రమంగా నిల్వ ఉంచి అమ్ముతున్నట్లు సమాచారం రాగా స్థానిక ఎస్ఐ కె.వెంకటరెడ్డి, సిబ్బంది నిందితుడి కిరాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనఖిలో నిషేధిత చైనా మాంజా తొమ్మిది బండళ్లు లభ్యమైనవి. కావున అట్టి వ్యక్తిపై అడ్డగూడూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇట్టి చైనా మంజను అమ్మడం గాని నిలువ చేయడం గాని చట్టరీత్య నేరమని పోలీసులు తెలిపారు. ఇట్టి చైనా మాంజ తయారీలో ప్లాస్టిక్ గాజులు ఇతర సింథటిక్ పదార్థాల మిశ్రమం పూతగా ఉంటుంది దీని కారణంగా ద్విచక్ర వాహనాల దారుల మెడలకు, పక్షులకు చుట్టుకుని ప్రమాదాలు తీవ్రంగా జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి ఇట్టి చైనా మంజాలు అమ్మిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోబడుతుందని ఎస్ఐ తెలిపారు.

## క్రీడలు ఒత్తిడిని దూరం చేస్తాయి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి ఉపయోగపడతాయని అలాగే ప్రతిరోజు వ్యాయామం తపనిసరి చేయాలని ఆపరేషన్ డిఈ టెక్నికల్ రాజు నాయక్ అన్నారు.తెలంగాణ ట్రాన్స్‌కో,డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ ఫుట్బాల్,వాలీబాల్,క్యారమ్స్ టోర్నమెంట్స్ శుక్రవారం ముగిసాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ నిరంతరం విధులను నిర్వర్తిస్తూ పని ఒత్తిడికి గురవుతూ విద్యుత్ ఉద్యోగులకు ఇలాంటి క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈలు ప్రసాద్ రావు,ప్రభాకర్, ఏడిఈ వేణుగోపాల చారి,నవీన్ అహ్మద్,స్పోర్ట్స్ జనరల్ సెక్రెటరీ తిరుగుడు శ్రీనివాస్,స్పోర్ట్స్ఆఫీసర్ నీలం జగన్నాథ్,బాలు,అంజాలరావు,సలీం,ఫారూఖ్,రాజు నాయక్ పాలోన్నారు.అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



## విరాళం అందజేత

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** నాంచారిపేట (తుంబాయి) గ్రామస్తులు మల్లికార్జున స్వామి, భ్రమరాంబిక అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని నాంచారిపేట మాజీ సర్పంచ్ పైల్ల వినోద సుధాకర్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోనీ నాంచారిపేట మధిరే తుంబాయిలో మల్లికార్జున స్వామి భ్రమరాంబిక అమ్మవార్ల నూతన గుడి నిర్మాణం, త్వరలో కళ్యాణోత్సవ కార్యక్రమం ఉండగా కళ్యాణ మహోత్సవానికి, గుడి నిర్మాణానికి తుంబాయి గ్రామస్తులు మాజీ సర్పంచ్ పైల్ల వినోద సుధాకర్ రెడ్డిని ఆర్థిక సాయం అడగ్గ వెంటనే స్పందించి రూ.50,116 గుడి నిర్మాణ కళ్యాణ మహోత్సవానికి విరాళం అందజేశారు.





## ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ :** రాయిపల్లి ఆర్ఎం రోడ్డు నుండి తిమ్మాపురం, సర్వేపల్లి వరకు రోడ్డు మొత్తం గుంతలుమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యకి వినతి పత్రంనీ మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు గౌడ్, ఓబిసి, కిసాన్ సెల్ అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, నాగం లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## జాస్ టాలెంటో ఫియెస్టా

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** విద్యార్థుల సమగ్ర ప్రతిభకు వేదికగా జాస్ టాలెంటో ఫియెస్టా అని జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ ఆవేస్ చిస్తీ అన్నారు. భువనగిరిలోని ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న బాచ్పాన్ స్కూల్, అకాడెమిక్ హైట్స్ స్కూల్, హ్యాపీ మెడోస్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన Jass Talento Fiesta 2026 ప్రతిభా ప్రదర్శన కార్యక్రమమానికి హాజరైయారు. ప్రతి విద్యార్థికి తనలోని ప్రత్యేక ప్రతిభను ప్రదర్శించుకునే ఒక స్వేచ్ఛాయుత వేదికగా రూపొందించబడిందన్నారు. ప్రముఖ విద్యావేత్త అంజలి గుప్తా, ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక వికాసం



**ప్రజాపక్షం/మాడుగులపల్లి :** క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,ఎన్‌బిఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ తెలిపారు.మానసిక,శారీరక దృఢత్వానికి క్రీడలే పునాది అని అన్నారు.మండల పరిధిలోని గుర్రప్పగూడెం గ్రామంలో జిపిఎల్111జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా సిద్దార్థ మాట్లాడారు.ప్రతీ క్రీడలో గెలుపోటములు సహజమని అన్నారు.క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలుట్ల బాబయ్య,మిర్యాల మధుసూదన్,మారుతీ వెంకటరెడ్డి,కర్ర ఇంద్రారెడ్డి,మోహన్ దాస్,డి.నాగరాజు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాతత్వంతో ముందుకు

**ప్రజాపక్షం/చివ్వెంల :** గ్రామంలో ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలని ప్రస్తుతం ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా సేవతత్వంతో మాత్రమే ముందుకు కొనసాగుతామని గ్రామ సర్పంచ్ బొల్లికొండ సైదులు అన్నారు. శుక్రవారం మండలంలోని గుంజలూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జెజ్జాల పిచ్చయ్య చిన్న కుమారుడు జెజ్జాల రమేష్‌ను పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దేవరం శ్రీనివాస్ రెడ్డి రమేష్ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. ఆ నగదును గ్రామ సర్పంచ్ చేతులు మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొనకొండ వీరయ్య, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సుంకరి ఉపేందర్, మాజీ ఉప సర్పంచ్ పెద్ది అంజయ్య, వార్డు మెంబర్ బొల్లికొండ దుర్గయ్య, బొజ్జ పాపిరెడ్డి, వలిశెట్టి ఆంజనేయులు, కొప్పు భద్రాద్రి, యూత్ సభ్యులు హరీష్, సాయిరామ్, అనిల్, శివ పాల్గొన్నారు.

## కాటెపల్లిలో శ్రమదానం

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** కాటెపల్లి సర్పంచ్ పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ మదార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకూడదని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వల్లాల పుష్పలత, వెంకటేష్ గ్రామవార్డు సభ్యులు మంత్రి జయమ్మ కుమార్ పాల్గొన్నారు.

## బెట్టింగ్ పెట్టి పేకాట ఆడుతూ పట్టుబడ్డారు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని ఖుదాబాక్స్ పల్లి గ్రామ శివారులో శుక్రవారం బెట్టింగ్ పెట్టి పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు రైడ్ నిర్వహించి పేకాట ఆడుతున్న ఖుదాబాక్స్ పల్లి గ్రామస్తులైన శిరబోయిన మహేందర్,పాశం మహేందర్ రెడ్డి,కోట్ల మధుకర్, కారింగు నరసింహులను పట్టుబడి నమోదు చేసి వారి వద్ద నుండి రూ.14వేల880లు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపారు.

## ఇంటర్మీడియట్ కళాశాలలు ఏర్పాటు చేయాలి




**ప్రజాపక్షం/మర్రిగూడ:** మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలను ఏర్పాటు చేయాలంటూ హైదరాబాదులో ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్యను మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు.నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు, మర్రిగూడ, ఘట్టుప్పల్ మండల కేంద్రాలలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు.మునుగోడు నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గం అని మండలానికి ఇంటర్ కళశాల ఉంటే పేద విద్యార్థులు ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుందని వీలైనంత తొందరగా ఆయా మండల కేంద్రాలలో ప్రభుత్వ ఇంటర్ కళశాలలను ఏర్పాటు చేయాలనీ కోరారు.

## క్యాలెండర్ ఆవిష్కణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన డైరీ,క్యాలెండర్ ను శాసనమండలి చైర్మన్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుంతకండ్ల దామోదర్ రెడ్డి, ర్గనైజింగ్ సెక్రెటరీ గంగా రెడ్డి, బి.ప్రహ్లోదర్ రావు,సంఘ భాద్యులు తదిరులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా విధులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితాను బీఎల్‌వోలు అయిన అంగన్‌వాడి టీచర్లు పేపర్ వర్క్, ఇంటింటికి తిరిగి మార్పులు చేర్పులు వంటి విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని సీడీపీవో రేఖల మమత అన్నారు. శుక్రవారం స్తానిక సబ్ కలెక్టరేట్ కార్యాలయ ఓపెన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె మాట్లాడుతూ ఓటరుజాబితాలో ఉన్న లేనివారి వారిని గుర్తించి మార్పులు చేర్పులు చేయాలన్నారు. సమావేశంలో కార్యాలయ పరిపాలన అధికారి, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్, గణాంక అధికారి రవీందర్‌రెడ్డి.



## యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా యువత స్వశక్తితో ఆర్థికంగా ఎదుగాలని మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నల్లాలబావి చౌరస్తా వద్ద ఉయ్యాల ప్రభు కుమార్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించే మామ 90స్ కిచెన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ మరింత మందికి ఉపాధి కల్పించాలని పిలుపునిచ్చారు. ఎప్పుడు సూర్యాపేట జనాలకి బిర్యాని అలవాటు పడి కొత్తదనం వేచి చూసే సమయంలో నూతనత్వాన్ని కోరుకుంటూ అదే టైంలో ప్రత్యేక తరహాలో స్పెషల్గా రాగి ముద్దను కలుపుతూ బాగారా రైస్‌తో నాన్ వెజ్ మూడు రకాల కూరలను అందిస్తూ నాణ్యత రుచి, శుచిపాటిస్తూ సరసమైన ధరలలో కష్టమర్లకు అందుబాటులో ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరు శైలేందర్, కుమ్మరికుంట్ల వేణు, కొండపల్లి దిలీప్‌రెడ్డి, జహీర్, పందిరి మల్లేష్, నిఖిల్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలి



**ప్రజాపక్షం/నాంపల్లి:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వాటి సాధనకు కృషి చేయాలని ఈఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ అన్నారు.శుక్రవారం నాంపల్లి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.కళాశాల ప్రిన్సిపల్ గంధం మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్మీడియట్ దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలన్నారు.కళాశాల స్థాయిలో ఇంటర్మీడియట్ దశ కీలకమన్నారు. నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూపాయలు 40 వేల విలువగల మైక్ సెట్,సౌండ్ బాక్స్‌లను ఫౌండేషన్ ద్వారా అందజేశారు. ఆయన వెంట ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ తదితరులు సర్పంచులు దామెర శోభ సహదేవ్,కడారి శ్రీశైలం యాదవ్,జంపాల రమేష్,ఈఎల్‌బి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేశం అభివృద్ధి చెందాలంటే సమర్థవంతమైన పాలన




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే నిర్మాణాత్మక సంస్కరణలు, సంస్థాగత సామర్థం, సమర్థవంతమైన పాలన,మానవ వనరుల అభివృద్ధి అత్యంత కీలకమని ప్రొఫసర్ ఆఫ్ ప్రాక్టీస్,గోల్డెన్ గేట్ యూనివర్సిటీ,శాన్ ఫ్రాన్సిస్కో డాక్టర్ విజయ్ కుమార్ వారధి తెలిపారు.నల్లగొండ పట్టణంలోని ఎన్‌జి కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన శుక్రవారం రెండవ రోజు జరిగిన సదస్సులో డాక్టర్ విజయకుమార్ వారిది ముఖ్య అతిథిగా అన్ లైన్‌లో పరిశోధన పత్రాలను ప్రెజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫసర్ డాక్టర్ జ్యోస్న,జాతీయ సదస్సు డైరెక్టర్ డాక్టర్ మునుస్వామి, కన్వీనర్ డాక్టర్ అదే మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బట్టు కిరీటం,ఆర్గనైజింగ్ సెక్రటరీ నర్సింగ్ కోటయ్య,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవి కుమార్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సిని కలసిన జిల్లా విద్యుత్ అధికారులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా విద్యుత్ అధికారులు ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ను నల్లగొండలోని అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చలు అందజేసి శాలువాతో సన్మానం చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన తెలంగాణ శాసనమండలి సమావేశంలో గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించి వారి కష్టాలు తీర్చాలని రైతుల ఇక్కట్లను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.రాష్ట్రంలో ప్రధానంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల కాలిపోతే 24గంటల వ్యవధిలో మరమ్మతు చేయాలనే నిబంధన అమలుకావడం లేద న్నారు. ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతుల పేరుతో రైతులు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వ్యయాన్ని భరిస్తున్నారన్నారు. మరమ్మతు కేంద్రాల వద్ద రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తెచ్చిన సమస్య లపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి చర్యలు తీసుకోవాలని విన్నపించిన విషయం తెలిసిందే అయితే దీనిపై విద్యుత్ శాఖ నల్లగొండ ఎస్ఈ వెంకటేశ్వర్లు జిల్లాలో విద్యుత్ సమస్యలు రాకుండా అని చర్యలు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎం ఎల్ సిని కలసినవారిలో నల్లగొండ డిఈ ప్రసాద్ రావు, మునుగోడు ఎడిఈనరేందర్ రెడ్డి, మునుగోడు ఎఈ అశోక్ లు తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరంతో ప్రజలకు మేలు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో సర్పంచ్ సోన్నాయిల రఘు ఆధ్వర్యంలో మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్ సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెడిసిటీ హాస్పిటల్ డాక్టర్లు గ్రామస్తులకు వివిధ రకాల టెస్టులను ఉచితంగా చేసి, సర్పంచ్ చేతుల మీదుగా మందులను ఉచితంగా పంపిణీ చేసి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుతో గ్రామ ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకుల బాలయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు బహుమతులు

**ప్రజాపక్షం/నాంపల్లి:** ఆడపిల్లలు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలలో ముందు బాగానే ఉండాలని,తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీ కృష్ణ అన్నారు. మండలంలోని పెద్దాపురం మోడల్ స్కూల్ లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శంకర్,ఆంజనేయులు, సంఘం నాయకులు అన్నెపాక అనిల్,నవీన్,విశ్వతేజ్,మల్లికార్జున్ పాల్గొన్నారు.

## పోలీసు సూచనలు పాటించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** సంక్రాంతి పండుగకు ఆంధ్రాకు వెళ్లే వాహనదారులు పోలీసు సూచనలు పాటించాలని సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వాహనాల రద్దీ పునరుద్ధరణ, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సూర్యాపేట రూరల్ పరిధి జాతీయ రహదారి 65పై మళ్లింపు చర్యలు తీసుకోవ డం జరిగిందని తెలిపారు. వాహనదారులు గమనించి వైజాగ్, రా జమండ్రి, కాకినాడ, విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే వారు ఈ మా ర్గాన్ని అనుసరించాలన్నారు. వాహనాల రద్దీ పునరుద్ధరణ, ప్రమాదాల నివారణలో భాగంగా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

## వట్టిఖమ్మంపహాడ్ వద్ద ఖమ్మం హైవేపై పోలీసు ఆంక్షలు

**ప్రజాపక్షం/చివ్వెంల :** సంక్రాంతి పండుగ ప్రయాణాల దృష్ట్యా వాహనాల రద్దీని నియంత్రించడం రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఖమ్మం సూర్యాపేట జాతీయ రహదారి 365బిబి పై హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను చివ్వెంల మండల పరిధిలో వట్టిఖమ్మంపహాడ్ వద్ద నియంత్రిస్తూ ఆంక్షలు అమలు చేయడం జరుగుతుందని చివ్వెంల ఎస్ఐ మహేష్ తెలిపారు. □లిపారు వైపు వెళ్లే హైదరాబాద్ వాహనాలను ఇక్కడ సర్వీస్ రోడ్డు నుండి సూర్యాపేట వెళ్లే పాత హైవే మీదుగా చివ్వెంల గ్రామం నుండి సూర్యాపేటకు మళ్ళించడం జరిగిందన్నారు. సూర్యాపేట పట్టణంలో ఖమ్మం అండర్‌పాస్ నుండి వెళ్లి హైదరాబాద్ వైపు వెళ్ళవచ్చని తెలిపారు. రాయినిగూడెం వద్ద హైదరాబాద్ వైపు యూటర్న్ మూసివేయడం వల్ల ప్రయాణికుల సౌకర్యార్థం, వాహనదారుల సౌకర్యార్థం ఈ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

## నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



**ప్రజాపక్షం/మర్రిగూడ:** సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని,జాతీయ పెన్షన్ పథకం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమికోపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని,జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని,పాఠశాలల విలీనం, మూసివేతను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు మర్రిగూడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి.కృష్ణయ్య,డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పి నాగేంద్రమ్మ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే.రూప్ సింగ్ ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాహనదారులకు అవగాహన

**ప్రజాపక్షం/డిండి;** హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ పోయొద్దని డిండి ఎస్ఐ బాలకృష్ణ పెట్రోల్ బంక్‌ల యాజమాన్యం, సిబ్బందికి సూచించారు. శుక్రవారం సాయంత్రం నో హెల్మెట్ నో పెట్రోల్ లో భాగంగా డిండిలోని హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో ప్రజలకు, వాహనదారులకు హెల్మెట్ ఉపయోగం గురించి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులందరు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు.

# పండుగల ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేయాలి



**ప్రజాపక్షం/చిట్యాలః** పాఠశాలల్లో విద్యార్థి దశలోనే విద్యార్థులకు పండుగల ఔన్నత్యాన్ని, వాటి గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శుక్రవారం జరిగిన భోగి, సంక్రాంతి పండుగ ముందస్తు వేడుకలలో నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : మున్సిపల్ పట్టణ కేంద్రంలో శాంతినికేతన్ స్కూల్లో శుక్రవారం తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయమైన సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా ఘనంగా భోగి పండుగ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎడ్ల తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సంక్రాతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. రజనీకుమారి, ఉపాధ్యాయులు వేణు, సుధాకర్, అంగన్‌వాడీ టీచర్ రేణుక, స్వీపర్ రమేష్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సంస్కృతి సాంప్రదా





యాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆదిత్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/హాలియా:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం హాలియాలోని శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భోగి మంటలను వేసి విద్యార్థులు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్,డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం యడవల్లి సుజిత, కోఆర్డినేటర్ ఎమ్మెన్నార్, పాఠశాల ఇంచార్జ్ యాస్మిన్ ఏవో నరేందర్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నకిరేకల్** : పట్టణంలోని ఎస్‌పిఆర్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ బి.కన్నయ్య గౌడ్,చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్ రెడ్డి,పాఠశాల విజనరీ శ్రీపతి రెడ్డి,పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సుందరి శివరామకృష్ణ,ఉపాధ్యాయి ని, ఉపాధ్యాయులు విద్యార్థిని,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాల అప్పాజీపేటలో సంక్రాంతి సంబరాలు ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జి వి రమేష్,ప్రిన్సిపల్ భవాని,ఏటీపీ అరుణ,డిప్యూటీ వార్డెన్ శిరీష,ఉపాధ్యాయ బృందం విద్యార్థునిలు సిబ్బంది ఉన్నారు.

ప్రజాపక్షం/తుర్కపల్లి ః మండలంలోని ములకలపల్లి గ్రామ పరిధి విశ్వభారత్ గ్లోబల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, రమాలీల, శైలజ, రాజేశ్వరి, కల్పన, శిరీష, స్వీటీ రెడ్డి, కవిత, నవనీత, విద్యార్థినీ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## స్టేట్ ఫస్ట్ సాధించిన క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి

**ప్రజాపక్షం/రామన్నపేట** : కామారెడ్డిలో గత మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ విద్యార్థి వి.శరణ్ తేజ్ తన అత్యుత్తమ విజ్ఞాన ప్రదర్శనతో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. గ్రీన్ ఎనర్జీ జూనియర్ విభాగంలో శరణ్ తేజ్ చేసిన ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకొని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి శరణ్ తేజ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ బి.యాదగిరి, అకాడమిక్ డైరెక్టర్ జె.మణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## స్వెటర్లు పంపిణీ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మున్సిపల్ 58 మంది పారిశుధ్య కార్మికులకు శీతాకాలం చలి నుండి రక్షణ పొందేందుకు టిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ మేరకు కార్మికులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలోని స్థానిక గాంధీజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా ట్రస్మా జిల్లా అధ్యక్షులు,గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడి ప్రీతి,కోడి శృతి,డైరెక్టర్స్ కర్నాటి నాగరాజు,సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సామల వెంకటేశం,రామేశ్వరి,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను కోలహలంగా ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఈ సంబరాలలో విద్యార్థిని విద్యార్థులతో సంక్రాంతి హరిదాసు వేషధారణలతో పలువురుని అలరించారు.



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** మండల పరిధిలోని రంగుండ్ల తండా ప్రాథమికోన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు చింత రెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,రజిత,వెంకటరమణ,విజిత, చైతన్య,రాజేష్, విద్యార్థులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ:** సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం మహిళా ఉపాధ్యాయులు విద్యార్థినులతో రంగేళి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.విద్యార్థులకు ఫస్ట్,సెకండ్,థర్డ్, విజేతలకు కన్సల్టేషన్ బహుమతులు అందజేశారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు జేరూప్ సింగ్,రేణుక,హైమా,వేద,లలిత మాస బాలరాజ్, కే కృష్ణారెడ్డి, కృష్ణయ్య, సిరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



## క్యాలెండర్ పంపిణీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలలోని గొల్ల గూడెం గ్రామంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే, బీర్ల అయిలయ్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధరావత్ రమేష్, గ్రామ ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బబ్బురి సాయికుమార్ గౌడ్ పాల్గొన్నారు.



## బోడ సుదర్శన్ చిత్రపటానికి నివాళి

**ప్రజాపక్షం/వలిగొండ** ః భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ బోడ సుదర్శన్ కొద్దిరోజుల క్రితం మరణించారు. శుక్రవారం వలిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో వారి చిత్రపటానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం మాట్లాడుతూ ప్రజా సమస్యల పైన ఎల్లవేళల పనిచేసిన వ్యక్తి ఆయన మరణం చాలా బాధాకరమని అన్నారు. ఆయన మృతికి సంతాపం మరియు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## భవన నిర్మాణానికి శ్రీకారం

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని గుజ్జవానికుంట తండాలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టినట్లు గ్రామ సర్పంచ్ గుగులోతు ధూప్ సింగ్ నాయక్ తెలిపారు. శుక్రవారం గ్రామ పెద్దలతో కలిసి పనులను లాంఛనంగా ప్రారంభించినట్లు,తండా ప్రజలకు పాలన మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో, అత్యాధునిక సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.

## పిఎం విశ్వకర్మ లబ్ధిదారులకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అర్హత ఉన్న డిజిటల్ లావాదేవీలకు డి బిటి మోడల్ లో లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేయబడుతుందని డిఎం,డిఐసి సతీష్ కుమార్,డింట్లో అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్ లు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని రెన్నిభవన్లో ఎమ్మెస్,ఎంఈ , హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ లబ్దిదారులకు ఒక రోజు మార్కెటింగ్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు డిజిటల్ మార్కెటింగ్,ఫైనాన్షియల్ లిటరసీ,ఈ కామర్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ మీద అవగాహన ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీసీ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి,అసిస్టెంట్ మేనేజర్ లార్షవర్ధన్,లింగారెడ్డి,ఆర్‌బిఓ ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ శివ,జిల్లా కోఆర్డినేటర్ మల్లేష్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హామీలను అమలులో విఫలం

**ప్రజాపక్షం/వలిగొండ** ః తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ భూములను అమ్మి పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బిజెపి వలిగొండ మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గారంటీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యం తీసుకువెళ్లి సంచుల పైన రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడో ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ ఫోటో ముద్రించి పంచుతుంది అన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సంక్రాంతి పండుగ సమీపిస్తున్న సందర్భంగా వివిధ గ్రామాల్లోని ప్రజలు ఇండ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లడం జరుగుతున్నందన విలువైన ఆభరణాలు వెంట తీసుకెళ్లాలని రూరల్ ఎస్ఐ ఎం.లక్ష్మయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని గూడూరు గ్రామస్తులకు అవగాహన కల్పించి మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరించి దొంగతనాలకు పాల్పడుతున్నారని ఇంట్లో ఎటువంటి విలువైన వస్తువులు ఉంచకుండా వారితోపాటు తీసుకెళ్లాలన్నారు. డబ్బు బంగారం వంటి ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకునే విధంగా చూసుకోవాలన్నారు. వీలైనంత మేరకు గ్రామాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసకోవాలని సూచించారు.

# సభా స్థలిని పరిశీలించిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సందర్భంగా ఈనెల 18న బహిరంగ సభ జరగనున్న ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానాన్ని శుక్రవారం సిపిఐ నేతలు పరిశీలించారు. సభా వేదిక, కళాకారుల వేదిక నిర్మాణ ప్రాంతాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కళాశాల మైదానం మొత్తం పరిశీలించి వాలంటీర్లకు తగు బాధ్యతలు అప్పగించారు. సభా స్థలికి హాజరయ్యే నాయకులు, కార్యకర్తలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా రాకపోకలకు అంతరాయం కలుగకుండా భారీకేడ్లను ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా సిపిఐ నాయకులు తెలిపారు. సభాస్థలిని పరిశీలించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, పోటు పూర్ణ, చింతల రమేష్, నంబూరి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# సారూ.. ఇవేమీ పట్టవా?

**-పన్ను వసూళ్లలో సిబ్బంది చేతివాటం**
**-పన్ను చెల్లించకున్నా తృప్తి పరిస్తే చాలట**
**-ఖమ్మం కార్పొరేషన్‌లో మారని సిబ్బంది తీరు**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** వ్యాపారుల నుంచి సామాన్యుల వరకు ఎవరైనా కార్పోరేషన్‌కు చెల్లించాల్సిన పన్ను కాస్త ఆలస్యమైతేనే నోటీసులు మొదలు సీజ్, ఇతరత్రా చర్యలంటూ కార్పోరేషన్ సిబ్బంది హడావుడి చేస్తారు. కానీ ఓ వ్యాపారి ఎటువంటి అనుమతులు లేకుండా కార్పోరేషన్‌కు పన్ను చెల్లించకుండా ఆరేండ్లుగా యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నా పన్ను వసూలు చేయాల్సిన సిబ్బంది ఆవైపుకు కన్నెత్తి చూడటం లేదంటే దీని వెనక ఉన్న మతలబు ఏమిటో అర్థమవుతుంది. కొందరు వ్యాపారులు కార్పోరేషన్‌లోని కొందరు అధికారులను తృప్తి పరుస్తూ వ్యాపారాలను అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కార్పోరేషన్ ఆదాయానికి గండికొడుతున్న ఉన్నతాధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. సిబ్బంది చేతివాటం తెలిసే మిన్నకున్నారా లేక ఉన్నతాధికారులకు తెలియకుండా సిబ్బంది కథ నడిపిస్తున్నారా అన్నది తేలాల్సి ఉంది. ఇల్లందు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం సమీపంలో ఓ వ్యాపారి స్టీల్ సిండికేట్ పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండానే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ వ్యాపారికి ట్రేడ్ లైసెన్స్ కానీ తాను వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణానికి ఇంటి నెంబర్ కానీ లేదు. ఈ విషయాన్ని కార్పోరేషన్ అధికారులే తెలియజేశారు. గతేడాది సమాచార హక్కు చట్టం క్రింద అడిగిన దానికి సమాధానంగా సంబంధిత స్టీల్ సిండికేట్‌కు ట్రేడ్ లైసెన్స్ కానీ ఆ దుకాణానికి ఇంటి నెంబర్ కూడా లేదని లిఖిత పూర్వకంగా తెలియజేశారు. గతేడాది జూన్ 26న ఈ విషయాన్ని తెలియజేసిన తర్వాత కూడా అధికారులు తగు చర్యలు తీసుకోకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తుంది. ఇంటి నెంబర్ లేకుండా, కార్పోరేషన్ అనుమతి లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న తగు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ఈ వ్యాపారి ఒక స్థలాన్ని లీజుకు తీసుకుని వ్యాపారం నిర్వహిస్తుండగా సదరు స్థలం లీజు కూడా రద్దయినట్లు సమాచారం. ఎటువంటి వ్యాపార అనుమతులు, ఇంటి నెంబర్ లేకుండా యథేచ్ఛగా వ్యాపారం నిర్వహిస్తుంటే కార్పోరేషన్ అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో కార్పోరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని కోరినప్పుడు అనుమతులు లేవని లిఖిత పూర్వకంగా తెలిపిన అధికారులు ఆ తర్వాత అయినా తగు చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఆ పని చేయలేదు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఇటువంటి అనుమతులు లేని వ్యాపారాలు, కార్పోరేషన్‌కు పన్ను చెల్లించకుండా వ్యాపారాలు నిర్వహించే వారు ఎంత మంది ఉన్నారు , వీరి ద్వారా కార్పోరేషన్‌కు వచ్చే ఆదాయంలో ఎంత నష్టపోతున్నారనే దానిపై ప్రజాప్రతినిధులు సైతం అధికారులను నిలదీయాల్సి ఉంది. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఇటువంటి అక్రమ వ్యాపారాలను నిలువరించాలని కార్పోరేషన్ ప్రజలు కోరుతున్నారు.

# అవినీతి అధికారులపై క్రిమినల్ కేసు

**-'ప్రజాపక్షం' వరుస కథనాలకు స్పందన**
**-మున్సిపల్ నిధులు రికవరీ చేయాలని ఆదేశాలు**







**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీలో దారి మళ్లిన జనరల్ ఫండ్స్‌కు సంబంధించిన రూ. 54 లక్షలను రికవరీ చేయడంతో పాటు అవినీతికి పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్డిఎం మసూద్‌అలీ ఆదేశాలు జారీ చేశారు. వైరా మున్సిపాలిటీలో లక్షలాది రూపాయల జనరల్ ఫండ్ నిధులు పక్కదారి పట్టాయి. ఈ విషయమై 'ప్రజాపక్షం' దినపత్రిక గతేడాది ఆగస్టు 8, 12 తేదీలలో వరుస కథనాలను ప్రచురించింది. ఈ కథనాలకు స్పందించి అక్టోబర్ 15న వరంగల్ ఆర్డిం మసూద్‌అలీ వైరా మున్సిపాలిటీలో నిధుల దారి మళ్లింపుపై విచారణ జరిపారు. విచారణ అనంతరం ఐతంరాజు వెంకటేశ్వరరావు విధుల నుంచి తొలగించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన అనంతరం శుక్రవారం రూ. 54 లక్షల రికవరీకి సంబంధించి అప్పుడు కమిషనర్‌గా పనిచేసిన మున్సిపల్ కమిషనర్ చింతా వేణు గతంలో సస్పెండ్‌కు గురైన ఐతంరాజు వెంకటేశ్వరరావుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. చింతా వేణు ప్రస్తుతం నందికొండ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ప్రజాపక్షం వరుస కథనాలతో రూ. 54 లక్షల భారీ అవినీతి బయటకు రావడం రికవరీకి ఆదేశాలు జారీ చేయడం పట్ల 'ప్రజాపక్షం' దినపత్రికకు పలువురు అభినందనలు తెలియజేశారు.

# ఆర్‌టిఓ కార్యాలయం వద్ద సిపిఐ(ఎం) నిరసన



**ప్రజాపక్షం/వైరా:** వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు విశేషంగా సేవలు అందిస్తున్న వైరా ఆర్టీవో కార్యాలయాన్ని వైరా నియోజకవర్గ కేంద్రంలోనే కొనసాగించాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. వైరా ఆర్‌టివో బోనకల్‌కు మారిచతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఆర్‌టివో కార్యాలయాన్ని బోనకల్‌కు తరలించడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్‌టివో కార్యాలయం వద్ద సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ జి.దినేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా వైరా కేంద్రంగా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేవిధంగా సేవలందిస్తున్న రవాణాశాఖ కార్యాలయాన్ని వైరా నుంచి మధిర నియోజకవర్గంలో బోనకల్‌కు మర్చాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బోనకల్ మండల కేంద్రంలో ఆర్‌టివో కార్యాలయం ప్రారంభించేందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు గురువారం బోనకల్ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న స్థలాన్ని వైరా ఎంవిఐ వరప్రసాద్, తహశీల్దార్ రమాదేవి, యుడిసి ఉపేందర్ పరిశీలించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు మచ్చా మణి, నాయకులు గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్‌రావు, కొంగర సుధాకర్, షేక్ నాగుల్‌పాషా, తోట కృష్ణవేణి, మందడపు రామారావు, మల్లెంపాటి ప్రసాదరావు, మాడపాటి రామారావు, యనమద్ది రామకృష్ణ, అమరనేని కృష్ణ, పానుగంటి రాంబాబు, మాడపాటి వెంకటేశ్వరరావు, మాడపాటి సుజాత, చావా కళావతి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి స్మారక క్రీడోత్సవాలు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి స్మారకార్థం నిర్వహించిన ఆలేరు నియోజకవర్గం స్థాయి ఉన్నత పాఠశాలల క్రీడోత్సవాల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎమ్మెల్సీ నెలికంటి సత్యం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, ఎంఈఓ మహాదేవరెడ్డి, మాజీ సర్పంచ్ బీసు చందర్ గౌడ్, నేతాజీ యోజనమండలి శివాజీ యూత్ అధ్యక్షులు దొంతరబోయిన మురళీకృష్ణ, మజ్జిగ నరేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సుగుణమ్మ, అఖిలపక్ష నాయకులు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్ఐ

**ప్రజాపక్షం/మాడుగులపల్లి:** జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రత మాసం వారోత్సవాలను భాగంగా శుక్రవారం మండలంలోని కుక్కడం గ్రామంలో గల కేజీవిబి పాఠశాల,కళాశాల యందు ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమాన్ని ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత నియమాలు,బాధ్యత,బాల్యవివాహాలు,ఈవిటీజింగ్,సైబర్ నేరాలు, చైనా మాంజా వల్ల కలిగే ప్రమాదాల గురించి హెల్మెట్,సీసీ కెమెరాల యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థినిలకు,వారి తల్లిదండ్రులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలిపి సుమారు 300 మంది పాల్గొనడం జరిగింది.

## ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థులకు పరామర్శ

**ప్రజాపక్షం/మాడుగులపల్లి :** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధి మాడుగులపల్లి మండలంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయిన పాములపహాడ్ గ్రామానికి చెందిన చింతకాయల సైదులు,భీమనపల్లి గ్రామానికి చెందిన మద్దెల రామదాసు,బొమ్మకల్ గ్రామానికి చెందిన నక్క వెంకటమ్మసైదులు ఇంటి వద్ద బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ స్వయంగా వారిని కలిసి ఓటమికి గల కారణాలను తెలుసుకొని రాజకీయంలో గెలుపు ఓటములు సహజమని దేనికి క్రుంగిపోకూడదని వారిని ఓదార్చడం జరిగింది.ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు పాలుట్ల బాబయ్య,యాతం లక్ష్మి నరేందర్ రెడ్డి,మారుతి వెంకట రెడ్డి తదితరులు ఉన్నారు.

## గ్రామ అభివృద్ధికి సహకరించాలి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్ కోరారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్ పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. పారిశుద్ధ్యం, గ్రామంలో నల్ల నీరు, వీధిలైట్లు వివిధ అంశాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ లలితా భాస్కర్ రెడ్డి, వార్డ్ సభ్యులు ఇంద్రాల రేణుక, రాములు, ఇంద్రాల అంజయ్య, యమగాని నరసింహ, మక్తాల మంగమ్మ ఐలయ్య, ముక్తాల రమేష్, ఎర్ర వెంకటరెడ్డి గ్రామ సెక్రెటరీ హరీష్ పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలి

**ప్రజాపక్షం/ భద్రాచలం :** ప్రజాపక్షం దినపత్రిక ప్రజలు, ప్రభుత్వానికి వారధిలా పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. 2026 ప్రజాపక్షం నూతన క్యాలెండర్‌ను స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియా రపభావం పెరిగిన ఈ రోజుల్లో పత్రికలకు ఏమాత్రం ఆదరణ తగ్గలేదన్నారు. జవాబుదారీ తనంగా ఉండాల్సిన వారి దారి తప్పితుంటే వారిని ప్రశ్నిస్తూ, ప్రజల కోసం పనిచేసేలా కథనాలు ఉండాలని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజాపక్షం దినపత్రిక దినదినాభివృద్ధి చెంది ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాతాడి దుర్గారావు, పట్టణ కన్వీనర్‌మారెడ్డి శివాజి, ఏఐటియుసి పట్టణ నాయకులు కంభంమెట్టు శ్రీను, జిల్లా సమితి సభ్యులు సాధనపల్లి సతీష్, భద్రాద్రి వెంకటేశ్వరరావు, ఎస్‌వివిఎస్ నాయుడు, మీసాల భాస్కరరావు, మహేష్, త్రిమూర్తులు, కొండబాబు, శోభన్, రామారావు, సీతారామరాజు, తుర్రం నరేష్, కొక్కిరేని అశోక్, వెంకటమ్మ, భాస్కర్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి ఘనంగా పంచామృతాభిషేకం

**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మద్యన కొలువై ఉన్న ( శ్రీకనకదుర్గ ) పెద్దమ్మతల్లి దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం ఘనంగా పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో అర్చకులు, భక్తుల జన్మస్థలం వద్దనున్న పెద్దమ్మతల్లికిపంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు వైభవంగా జరిపించారు.

## సిఎం కప్ 2026 ర్యాలీ

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని కొత్త బస్టాండ్ నుంచి మినీ క్రీడా మైదానం వరకు క్రీడాజ్యోతితో ర్యాలీ శుక్రవారం జరిగింది. క్రీడాజ్యోతిని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి క్రీడలు ప్రత్యేకంగా అవసరమని క్రీడల్లో ఉల్లాసానికి ఉత్సాహానికి శరీర దారుఢ్యానికి క్రీడలు ఉపయోగపడతాయని విద్యార్థులకు చదువుతో పాటు విద్యతోపాటు క్రీడలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి, మండల విద్యాశాఖ అధికారి నివేదిత పాల్గొన్నారు.